
సాక్షి ఒడిశా

శుక్రవారం ı 23 ı ఫిబ్రవరి ı 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.60.833లు, బంగారం 4గ్రాములు 650 మిల్లీగ్రాములు, వెండి 21గ్రాములు 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఈనెల 28 నుంచి రాష్ట్రపతి పర్యటన



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటించను న్నారు.

- IIలో

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురువారం దాదాపు 30 డిగ్రీల సెల్సియస్‌ పైబడి గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయింది.

- IIలో

న్యూస్‌రీల్‌

నిందితురాలికి యావజ్జీవం



కొరాపుట్‌ జిల్లా కోర్టు

జయపురం: పట్టణ పోలీసుస్టేషన్‌ పరిధి హన్నాగుడలో 2017లో సొంత సోదరుడిని చంపిన నిందితురాలికి యావజ్జీవ శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. 2017 ఆగస్టు 13వ తేదీన తన తల్లి పెన్షన్‌ డబ్బుల కోసం రయిల ఖొర అనే యువతి తన సొంత సోదరుడు రత్న జానిని హత్య చేసింది. రయిలకు వివాహమవ్వడంతో వేరేగా ఉంటోంది. తమ్ముడు రత్న జానితో వారి తల్లి ఉంటోంది. అయితే తల్లి పెన్షన్‌ డబ్బులు తనకు ఇవ్వాలని రయిల సోదరుడితో గొడవ పెట్టుకుంది. అనంతరం రత్న జాని ఇంటిలో నిద్రపోతున్న సమయంలో గొడ్డలితో నరికి చంపింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు చేరుకొని నిందితురాలిని అరెస్టు చేశారు. ఈ కేసులో జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర 15 మంది సాక్షులను విచారించి గురువారం తీర్పు వెల్లడించారు. నిందితురాలికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఏడాది శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్‌ చోరీ



పడిపోతున్నట్లు నటిస్తున్న దుండగుడు, మరో వృత్తంలో బాధితుడు

రాయగడ: స్థానిక పాత పోలీసుస్టేషన్‌ సమీపంలోని విజయ్‌ జ్యూయలర్స్‌ ఎదురుగా సినీ ఫక్కీలో ఒక వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ చోరీకి గురైన ఘటన సీసీ కెమేరాలో రికార్డయ్యింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఒక బైకుపై వచ్చి విజయ్‌ జ్యూయలర్స్‌ ఎదుట ఆపారు. అనంతరం బైక్‌ వెనుక కూర్చున్న వ్యక్తి కిందికి దిగాడు. అదే సమయంలో బైకు నడిపే వ్యక్తి బైక్‌ స్టాండ్‌ వేస్తుండగా అదు పుతప్పి కిందపడిపోతునట్లు యాక్టింగ్‌ చేశాడు. దీంతో అక్కడే ఉన్న ఒక వ్యక్తి బైక్‌ను ఎత్తేందుకు సహకరించాడు. ఈలోపు బైకు నుంచి ముందే దిగిన దుండగుడు సాయం చేసిన వ్యక్తి జేబులో మొబైల్‌ కొట్టేశాడు. అనంతరం ఎప్పటిలాగే ఇద్దరూ బైకుపై కలిసి వెళ్లిపోయారు. కొంతసేపటికి తన జేబులో సెల్‌ఫోన్‌ లేకపోవడంతో బైక్‌పై వచ్చినవారే దొంగతనం చేశారని గుర్తించి బాధితుడు ఎం.జయ్‌ అనే వ్యక్తి లబోదిబోమన్నాడు. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమేరా ఆధారంగా దుండగుల కోసం గాలిస్తున్నారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో చోటుచేసుకుంటున్న దొంగతనాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

గుడారిలో కాంగ్రెస్‌ భారీ ర్యాలీ



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ సప్తగిరి తదితరులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో కాంగ్రెస్‌ పార్టీ గురువారం భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంపీ సప్తగిరి ఉలక మాట్లాడుతూ బీజేడీ హయాంలో గత రెండు దశాబ్దాలకు పైగా గుడారి ఎన్‌ఏసీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్టంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే గుడారి రూపరేఖలు పూర్తిగా మార్చేస్తామని తెలియజేశారు. ఈసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బిజయ్‌ కుమార్‌ గొమాంగో, పద్మపూర్‌ సమితి నైరా పంచాయతీ సర్పంచ్‌ తులసీ సాబొరా, భాస్కర జగరంగ, సత్యజిత్‌ గొమాంగో పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి

- అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నాం
- గత పదేళ్లలో అనేక సమస్యలకు పరిష్కారం
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌

కొరాపుట్‌:

కేంద్రంలో బీజేపీ హయాంలోనే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ అన్నారు. నబరంగ్‌పూర్‌ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్‌ హౌస్‌ ఎదుట గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత రెండుసార్లు కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం అనేక సమస్యలకు పరిష్కారం చూపించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంతో మన దేశం అన్నిరంగాల్లో పోటీ పడుతోందని వెల్లడించారు. ఆర్టికల్‌ 370 రద్దు, కాశ్మీర్‌ విభజన, త్రిపుల్‌ తలాక్‌ రద్దు, అయోధ్య రామ మందిరం నిర్మాణం వంటి గొప్ప నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులను దేశానికి తీసుకురావడానికి అక్కడ తాత్కాలికంగా యుద్ధం నిలిపివేయడం ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉన్న గుర్తింపునకు నిదర్శనమన్నారు. మరోసారి దేశ ప్రజలు నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్‌ సామల్‌, కలహండి ఎంపీ బసంత పండా, బలంగీర్‌ ఎంపీ సంగీతా సింగ్‌దేవ్‌ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి

బరంపురం: ఒడిశా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ ఆరోపించారు. స్థానిక అంబుపువ మైదానంలో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్ర అభివృద్ధిపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించి, వివిధ రకాల పథకాల కింద కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారి మళ్లించి బిజూ పేరుపై పథకాలు అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. బీజేడీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి ప్రజలు ఇప్పటికే గ్రహించారని చెప్పారు. వచ్చే 2024 ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని ధ్వజమెత్తారు.



బరంపురం: బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

మహిళలకు రక్షణ కరువు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని రాజ్‌నాథ్‌ సింగ్‌ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా రోజురోజుకీ మహిళల హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, వరకట్న, గృహహింస నేరాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించలేని వ్యక్తికి సీఎంగా కొనసాగే అర్హత లేదన్నారు. గడిచిన 21 ఏళ్ల నవీన్‌ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయి ప్రత్యామ్నాయం కోరుతున్నారని వెల్లడించారు. దేశంలో ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చామని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలో సైతం విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఒడిశా రాష్ట్రంలో 120 సీట్లు కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో భువనేశ్వర్‌ ఎంపీ అపరజిత సడంగి తదితరులు పాల్గొన్నారు.



బరంపురం: మాట్లాడుతున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌



కొరాపుట్‌: కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు



కొరాపుట్‌: జగన్నాథ స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

బొరిగుమ్మలో ఉద్రిక్త వాతావరణం



సివిల్‌ సప్లయ్‌ అధికారితో మిల్లు యజమానులు

- మిల్లు యజమానులు, లారీ డ్రైవర్ల మధ్య వివాదం

జయపురం: బొరిగుమ్మలో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైస్‌మిల్లు యజమానులకు, లారీ డ్రైవర్లు, ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులకు మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరు మిల్లు యజమానులు తీవ్రంగా గాయపడ్డారని ఆరోపణ. అంతేకాకుండా బంగారు చైన్‌, రూ.50 వేల నగదు దోచుకున్నారని యజమానులు ఆరోపిస్తుండగా, డ్రైవర్‌ని కొట్టి 3 లారీలను ధ్వంసం చేశారని, ఒక డ్రైవర్‌ ఆచూకీ కనిపించడం లేదని లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ ఆరోపించింది. మిల్లు యజమానుల ధాన్యం, బియ్యం రవాణా చేసే లారీల విషయంలో ఈ వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ లారీలను వినియోగించకుండా రైస్‌మిల్లు యజమానులు తమ సొంత లారీలను వినియోగించడంతో వివాదం చెలరేగింది. లారీలకు తగిన లోడ్లు లేకపోవడంతో బొరిగుమ్మలోని ఒక మిల్లులోకి డ్రైవర్లు వెళ్లి మిల్లు యజమాని బి.శివ కుమార్‌ను కొట్టారని, మెడలో బంగారు గొలుసు, అతడి వద్దనున్న రూ.50 వేలు దోచుకుపోయారని మిల్లు యజమానులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బొరిగుమ్మ కెందుగుడలోని పి.నారాయణరావు మిల్లుకు వెళ్లి కొట్టారని, అక్కడ ఉన్నటువంటి తవుడు లోడుతో ఉన్న లారీని తీసుకుపోయారని ఆరోపిస్తూ జయపురం సూర్యరావు, కె.దాలినాయుడు తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలపై దర్యాప్తు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మిల్లు యజమానులు బొరిగుమ్మ ఎస్డీపీవో సుబేందు శబరను కలిసి విన్నవించారు. అలాగే కొరాపుట్‌లో కలెక్టర్‌, ఎస్పీలను కలిసి తమకు న్యాయం జరిగేవరకు మిల్లులు మూసివేస్తామని హెచ్చరించారు. సకాలంలో ప్రొక్యూర్‌మెంట్‌ బియ్యం ఇవ్వాలని ఒత్తిడి చేయవద్దని జిల్లా సివిల్‌ సప్లయ్‌ అధికారికి విజ్ఞప్తి చేశారు. అయితే మిల్లర్స్‌ అసోసియేషన్‌ ఆరోపణలను లారీ యజమానుల సంఘం తీవ్రంగా ఖండించింది. బొరిగుమ్మ ట్రక్కు ఓనర్స్‌ అసోసియేషన్‌ వారు పిలవడంతో తమ వారు వెళ్లారని, వారిపై మిల్లు యజమానులు దాడి చేశారని మండిపడ్డారు. ఘటనపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్‌ చేశారు.

నేటి నుంచి మహానగర్‌ ఉత్సవాలు

బరంపురం: స్థానిక కల్లికోట్‌ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్‌ సాంస్కృతిక పరిషత్‌ ఆధ్వర్యంలో మహానగర్‌ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఈనెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గిరిజనులకు పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న గిరిజనులతో అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో గుమ్మా సమితి తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ మేళా గురువారం జరిగింది. ఈ మేళాకు ముఖ్య అతిథిగా కలెక్టర్‌ స్మృతి రంజన్‌ ప్రధాన్‌ హాజరై 475 మంది గిరిజనులకు జంగిల్‌ జమ్మి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పీవో పాల్గుణీ మఝి, ఎస్‌డీసీ చైర్మన్‌ మరియం రైతో, గుమ్మా తహసీల్దార్‌ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఎస్పీ జగ్‌మోహన్‌ మీనన్‌

బరంపురం: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని గంజాం జిల్లా కలెక్టర్‌ దివ్యజ్యోతి పరిడా అన్నారు. జిల్లాలోని అస్కా పట్టణంలో గంజాం పోలీసు జిల్లా వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌ దివ్యజోతి పరిడా, ఎస్పీ జగ్‌మోహన్‌ మీనన్‌ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ దివ్యజోతి పరిడా మాట్లాడుతూ వివిధ దుర్ఘటనల్లో సకాలంల్లో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఎస్పీ జగ్‌మోహన్‌ మీనన్‌ స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నేటి నుంచి నాట్య మండపం మరమ్మతులు



ఛొత్తీసా నిజోగ్‌ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- భక్తులకు నిరంతరాయంగా జగన్నాథుని దర్శనం
- సేవాదుల్లో తాత్కాలిక సర్దుబాట్లు

భువనేశ్వర్‌: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలోని నాట్య మండపం మరమ్మతుల పనులు శుక్రవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. 12వ శతాబ్దానికి చెందిన ఈ మందిరంలో భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) చేపట్టనున్న పనులు మార్చి 19వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మేరకు నీలాద్రి భక్తి నివాస్‌ ఆవరణలో జరిగిన ఛొత్తీసా నిజోగ్‌ (36 నియోగుల సంఘం) సమావేశంలో నిర్ణయించారు. ఏప్రిల్‌ నాటికి శ్రీమందిరం నాట్య మండపం మరమ్మతుల పనులు పూర్తి చేయాలని రాష్ట్ర హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

ఏఎస్‌ఐ పర్యవేక్షణలో...

ఈనెల 23 నుంచి మార్చి 19 వరకు నాట్య మండపం పరిరక్షణ పనులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వ్యవధిలో నిత్యం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు ఏఎస్‌ఐ ప్రత్యక్ష పర్యవేక్షణలో పనులు చేపడతారు. ఆలయ ఆచారాలను క్రమబద్ధీకరించడానికి తెల్లవారుజామున 2 గంటలకు సింహద్వారం తెరవబడుతుంది. రాత్రి 11 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. శ్రీ మందిరం సేవా సబ్‌ కమిటీ ప్రతినిధులతో సంప్రదించిన మేరకు శ్రీమందిరంలో సేవాదులను తాత్కాలికంగా సవరించినట్లు పేర్కొన్నారు. నాట్య మండపం పనుల నేపథ్యంలో భక్తులు, యాత్రికులకు స్వామి దర్శనంలో ఎటువంటి అంతరాయం కలగదని స్పష్టం చేశారు. పుణ్యక్షేత్రంలో జరుగుతున్న పరిరక్షణ పనులు నిర్ధారిత కాల పరిమితిలో పూర్తవుతాయని పూరీ కలెక్టర్‌ సమర్థ వర్మ తెలిపారు. సమగ్రంగా ఈ పనులు 15 నుంచి 20 రోజుల్లో పూర్తవుతాయన్నారు. రత్న భాండాగారం ఉత్తరం వైపున స్వల్పంగా పగుళ్లు గుర్తించినట్లు ఏఎస్‌ఐ సూపరింటెండెంట్‌ డి.బి.గొడొనాయక్‌ తెలిపారు. వీటిని నిర్ధారిత సమయంలో సరిచేస్తామని వివరించారు. ఐఐటీ చెన్నై రూపొందించిన నమూనా ప్రకారం నాట్య మండపం బీమ్‌ పనులు చేపట్టినట్లు తెలిపారు.

మాతృభాషను గౌరవించాలి

భువనేశ్వర్‌: ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) ప్రాంగణంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ మాతృభాష వేత్త, ఏపీఐసీఓఎల్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కృష్ణ కేశవ్‌ షడంగి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యునెస్కో తీర్మానం ప్రకారం ప్రపంచవ్యాప్త వేడుకలకు అనుగుణంగా భాష, సాంస్కృతిక వైవిధ్యంపై అవగాహన పెంపొందించడానికి, బహుభాషావాదాన్ని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బహుభాషా విద్య అనేది తరతరాల అభ్యాసానికి మూలస్తంభం శీర్షికతో ఈ ఏడాది అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించడం విశేషం. దైనందిన జీవితంలో వినియోగంతోనే మాతృభాషకు మనుగడ ఉంటుందని కృష్ణ కేశవ్‌ షడంగి అన్నారు. సమకాలీన కాలంలో మాతృభాష వినియోగంపై ఆచరణాత్మక దృక్పథం అవసరమని పేర్కొన్నారు. మాతృభాష అధికారిక ఇతరేతర వ్యవహారాల భాష కాకపోయినా, మన కుటుంబం, స్నేహితుల మధ్య వ్యవహారిక భాషగా ఆదరించాలని పిలుపునిచ్చారు. నిత్య సంభాషణలో మాతృభాష మాధ్యమంగా ఉండాలన్నారు. మాతృభాషను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ కేశవ్‌ షడంగి

మాతృభాష హృదయ భాష

ఐఐటీ భువనేశ్వర్‌ డైరెక్టర్‌ శ్రీపాద్‌ కర్మల్కర్‌ మాట్లాడుతూ మాతృభాష హృదయ భాష అని ఉద్ఘాటించారు. భాష కేవలం సమాచార మాధ్యమ సాధనం కాదని, మన సంస్కృతి, చరిత్ర, గుర్తింపునకు సుసంపన్నమైన నిధిగా పేర్కొన్నారు. సమకాలీన అవసరాలకు అనుగుణంగా మాతృభాషల అభివృద్ధి, అనుకరణ మన చారిత్రక మూలాలకు పటిష్టమైన పట్టుగొమ్మగా నిలుస్తాయని పేర్కొన్నారు. భాషా వైవిధ్యాన్ని పెంపొందించేందుకు పీహెచ్‌డీ అభ్యర్థులు తమ పీహెచ్‌డీ థీసిస్‌ను ఆంగ్లంతో పాటు ఏదైనా భారతీయ భాషలో సమర్పించడాన్ని ఐఐటీ భువనేశ్వర్‌ అలవాటుగా మార్చిందని తెలియజేశారు. రిజిస్ట్రార్‌ బామదేవ్‌ ఆచార్య మాట్లాడుతూ.. సమాజం కోసం బృహత్‌ లక్ష్యాలను సాధించడానికి మాతృభాష ప్రాముఖ్యతని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఐఐటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు వారి వారి మాతృభాషలో కవితలు, పాటలు ఆలపించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



తుదిమెరుగులు దిద్దుకుంటున్న ఆలయం

రాయగడ: సదరు సమితి అమలాభట్ట గ్రామం లోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఎకరా స్థలంలో నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దూడల శ్రీనివాస్ తెలియజేశారు. ప్రతిష్ఠా కార్యక్రమాలు వేద పండితులు భాస్కరాచార్యులతో పాటు మరో 30 మంది పండితులు, రుత్వికులతో జరిపించనున్నట్లు వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కౌంటింగ్ కోసం గదుల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ నిర్వహణ కేంద్రాల కోసం గదులను ఎచ్చెర్ల తహశీల్దార్ వి.శ్యామ్‌కుమార్‌తో కూడిన రెవెన్యూ అధికారులు బృందం గురువారం పరిశీలించింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల ఈవీఎంలు ఇక్కడే భద్రపర్చనున్నారు. ఈ మేరకు స్ట్రాంగ్ రూంలు జిల్లా అధికారుల సూచనలు మేరకు సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ కోసం విశాలంగా ఉన్న గదులు సిద్ధం చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల 309 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్‌ల స్వీకరణ, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం శ్రీ శివానీలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ ఇక్కడే కౌంటింగ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ బంగ్లాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ

అరసవల్లి: ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని జిల్లాలో ఉన్న ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో వాచ్‌మెన్‌లు, అటెండర్లు, శానిటేషన్ వర్కర్లు తదితర పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా ఆర్ అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల అర్హులు వచ్చేనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను స్థానిక సాయిబులతోట వద్ద ఉన్న ఆర్ అండ్‌బీ ఎస్ఈ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

చిరకాల ఉషస్సు


● జెమ్స్‌లో అవయవదానం



ఉషారాణి

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో మరోసారి అవయవదానం జరిగింది. పాతపట్నం మండలం పెదలోగిడి గ్రామానికి చెందిన జైనవలస ఉషారాణి (40) ఈ నెల 19న ఓ శుభకార్యానికి వెళ్తూ హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆమెను శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడే మూడు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్సను అందజేశారు. కానీ అప్పటికే ఆమె అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వైద్యులు చూశాక బ్రెయిన్ పూర్తిగా పనిచేయడం లేదని తెలిసింది. దీంతో ఇదే విషయాన్ని ఆమె భర్త కృష్ణారావు, పిల్లలు నిఖిత, పల్లవి, జోషిత్‌లకు తెలియజేశారు. ఉషారాణి అవయవాలను వేరొకరిలో చూసుకోవచ్చని జీవన్‌దాన్ సంస్థను గురువారం కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. లివర్‌ను విశాఖపట్నంలోని పినాకిల్‌కు, కిడ్నీని విశాఖ కేజీహెచ్‌కు, కళ్లను రెడ్‌క్రాస్‌కు, మరో కిడ్నీని శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి అందించారు. మృతదేహానికి జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఏఓ రామ్మోహన్, డైరెక్టర్ డాక్టర్ సుధీర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ శివ అన్వేష, ఆర్ఎంఓలు డాక్టర్ బాలమురళీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురువారం దాదాపు 30 డిగ్రీల సెల్సియస్ పైబడి గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయింది. 18 చోట్ల 35 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయినట్లు స్థానిక వాతావరణ శాఖ కార్యాలయం పేర్కొంది. ఈ కేంద్రం సమాచారం ప్రకారం రాష్ట్రంలో సోన్‌పూర్ అత్యధిక వేడి ప్రాంతంగా నిలిచింది. ఈ ప్రాంతంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా 36.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయింది. తదుపరి స్థానంలో 36.2 డిగ్రీల సెల్సియస్‌తో రాజధాని నగరం భువనేశ్వర్ నిలిచింది. వసంతంలో వేసవి తాపంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. వేసవి తీవ్రతపై కలవరపడుతున్నారు. 1963 సంవత్సరం ఫిబ్రవరి నెలలో నమోదైన 42.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గరిష్ట ఉష్ణోగ్రతగా నగరం ఆల్ టైమ్ రికార్డు కొనసాగుతోందని వాతావరణ శాఖ సమాచారం. 2019 సంవత్సరం ఫిబ్రవరి 23న నగరంలో 39.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గురువారం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పగటి పూట ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ పైబడింది.

తేలికపాటి వర్ష సూచన

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో వేసవి తాపం నుంచి కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. ఈనెల 28వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం తెలిపింది. కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా మరియు జాజ్‌పూర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. ఢెంకనాల్, కందమాల్, రాయగడ వంటి జిల్లాలతో పాటు ఒడిశా తీర ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయి.

ఎల్లో అలర్ట్

బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయబడింది.

రానున్న 4 నుంచి 5 రోజుల్లో పలు ప్రాంతాల్లో రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పు ఉండదని ఐఎండీ అంచనా వేసింది. రాబోయే 24 గంటల్లో గరిష్ట మరియు కనిష్ట ఉష్ణోగ్రతలు వరుసగా 36 డిగ్రీల సెల్సియస్ మరియు 23 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం సమాచారం.

రాష్ట్రంలో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
సోన్‌పూర్	36.3
భువనేశ్వర్	36.2
తాల్చేరు	36.2
టిట్లాగడ్	36.0
బౌధ్	36.0
ఝార్సుగుడ	35.7
భద్రక్	35.6
ఢెంకనాల్	35.6
భవానీపట్న	35.5
బొలంగీరు	35.5
నయాగడ్	35.5
కటక్	35.4
మల్కన్‌గిరి	35.4
అంగుల్	35.3
బాలాసోర్	35.2
చాంద్‌బాలి	35.2
జాజ్‌పూర్	35.2
పర్లాకిమిడి	35.0

నెరవేరిన దురువ ప్రజల కల



దురువ సాంప్రదాయ యువతులు



దురువ సాంప్రదాయ పురుషులు

జయపురం: తమను ఆదివాసీలుగా గుర్తించాలని అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్న దురువ సాంప్రదాయ ప్రజల కల నెరవేరింది. కేంద్ర ప్రభుత్వం వారిని ఆదివాసీలుగా గుర్తించినట్లు ప్రకటించింది. దీంతో దురవ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్, హల్దికుండ్ గ్రామ పంచాయతీలు, కుంద్ర, కోట్‌పాడ్ సమితిల్లో దురువా సాంప్రదాయ ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారు. వీరు దట్టమైన అటవీ ప్రాంతాల్లో పర్వతాల మధ్య జీవనం సాగిస్తుంటారు. కానీ ఆదివాసీలుగా గుర్తింపు లభించకపోవడంతో ప్రభుత్వ సౌకర్యాలు పొందలేకపోయారు. తమను ఆదివాసీలుగా గుర్తించి ప్రభుత్వ సౌకర్యాలు సమకూర్చాలని, తమ పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ఆదివాసీలకు కేటాయించిన కోటాను అమలు చేయాలని కొన్ని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు వారి కోరిక నేరవేరింది. దీంతో గ్రామాల్లో సంబర వాతావరణం నెలకొంది.

ఓహెచ్‌ఈ రైలు ఇంజిన్‌లో మంటలు



ఓహెచ్‌ఈ ఇంజిన్‌లో చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఢెంకనాల్ జిల్లా జొరండా రోడ్ స్టేషన్‌లో గురువారం ఓహెచ్‌ఈ రైలు ఇంజిన్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెయింటెనెన్స్ వ్యాన్‌లో మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. అగ్ని ప్రమాదానికి గురైన ఈ ఓహెచ్‌ఈ వ్యానులో 12 మంది రైల్వే ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. వీరంతా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. ఖుర్దా రోడ్ రైల్వే మండలం రాజా అఠొగొడా స్టేషన్ నుంచి ఢెంకనాల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

సకాలంలో ఢెంకనాల్ నుంచి అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరకొని మంటలను అదుపు చేశారు. మంటలను అదుపు చేసేందుకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ మార్గంలో రైలు రాకపోకలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడిందని రైల్వే వర్గాలు తెలిపాయి. లోకో పైలట్‌తో సహా 12 మంది ఉద్యోగులు ఇంజిన్ నుంచి కిందికి దిగి సురక్షితంగా బయటపడ్డారు.

పరీక్షల నిర్వహణపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెన్త్, ఇంటర్, డీఎస్సీ, టెట్ నిర్వహణపై తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. ఆయా పరీక్షలు జరిగే తేదీల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, డీఈఓ వెంకటేశ్వర రావు, విద్యాశాఖ పరీక్షల సహాయ కమిషనర్ ఆలీఖాన్, ఆర్ఐఓ దుర్గా రావు, డీవీఈఓ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28 నుంచి రాష్ట్రపతి పర్యటన



భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28 నుంచి రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు రాష్ట్రంలో ఆమె పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన గురువారం లోక్‌సేవా భవన్‌లో రాష్ట్రపతి పర్యటన కోసం పరిపాలనా, అధికారిక సన్నద్ధతను ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన సందర్భంగా మయూర్‌భంజ్, కెంజొహర్, బరంపురం, భువనేశ్వర్, కటక్ మరియు సంబల్‌పూర్‌లలో వివిధ కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ కార్యక్రమాల గురించి హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ బాలా తెలియజేశారు. సమీక్ష సమావేశంలో హోం శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి దేవ్ రంజన్ కుమార్ సింగ్, సంబంధిత శాఖల కార్యదర్శులు, ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్‌కుమార్ షడంగి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఈనెల 28న రాయ్‌రంగ్‌పూర్‌లో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, ఫిబ్రవరి 29న ఉదయం మా కీచకేశ్వరి ఆలయ సందర్శన, కెంజొహర్ ధరణీధర్ విశ్వవిద్యాలయంలో గిరిజనులపై ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సు ప్రారంభోత్సవం వంటివి రాష్ట్రపతి హాజరయ్యే ప్రముఖ కార్యక్రమాల్లో ఉన్నట్లుగా పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం భువనేశ్వర్‌లోని ఉత్కళ విశ్వ విద్యాలయం 53వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముర్ము హాజరవుతారు. మార్చి 1న రాష్ట్రపతి బరంపురం విశ్వ విద్యాలయం 25వ స్నాతకోత్సవానికి హాజరవుతారు. మార్చి 2న రాష్ట్రపతి సంబల్‌పూర్‌లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాష్ట్రపతి ఒడిశాకు చేరుకోవడం నుంచి ఆమె న్యూఢిల్లీకి తిరిగి వెళ్లేంత వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం వరకు రాష్ట్ర యంత్రాంగం మరియు సంబంధిత జిల్లా యంత్రాంగం ద్వారా విస్తృతమైన భద్రత మరియు ఇతర సంబంధిత సన్నాహాలను సమావేశంలో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమావేశానికి హాజరయ్యారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాష్ట్రపతికి పలు చోట్ల అనేక కార్యక్రమాలు ఉన్నందున అన్ని ప్రాంతాలను ముందుగానే పరిశీలించి ఏర్పాట్లను బాగా అధ్యయనం చేయాలని చీఫ్ సెక్రటరీ అనుబంధ అధికారులకు ఆదేశించారు. తదనుగుణంగా యంత్రాంగం సిద్ధం చేయాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు మరియు పోలీసు సూపరింటెండెంట్‌లకు ముఖ్య కార్యదర్శి ప్రదీప్ జెనా అవసరమైన సూచనలు చేశారు. పర్యటనలో రాష్ట్రపతి బస, భద్రతా ఏర్పాట్లు, మీడియా కార్యక్రమం, ప్రచురణ, ప్రసారం, ఆరోగ్య సంరక్షణ, చికిత్స, అంబులెన్స్, కార్యక్రమ స్థలానికి దారితీసే రోడ్ల నిర్వహణ, రోడ్ల పారిశుద్ధ్యంపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమాలు జరిగే అన్ని చోట్లా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, సీటింగ్ ఏర్పాట్లు, బారికేడింగ్ ఏర్పాట్లు, అవసరమైన పాస్ ఏర్పాట్లు, వేదిక వద్ద సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా మీడియాకు కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని అందించే సౌకర్యాలు, వేదిక వద్దకు ఇంటర్నెట్ సదుపాయం, అగ్నిమాపక ఏర్పాట్లు విషయమై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాష్ట్రపతి పర్యటనను సజావుగా నిర్వహించేందుకు హోం శాఖ తరపున కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు.

పర్లాకిమిడి టిక్కెట్టు ఎవరికో..!

● బీజేడీలో పెరుగుతున్న ఆశావాహులు



గవర తిరుపతిరావు



రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గజపతి జిల్లా పర్లాకిమిడి నియోజకవర్గం అధికార బీజేడీ టిక్కెట్టుపై ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా పర్లాకిమిడి గజపతి వంశీయురాలు కల్యాణీ దేవి గజపతికి చివరి క్షణంలో పార్టీ టిక్కెట్టు ఇచ్చారు. కానీ ఆ ఎన్నికల్లో ఆమె మూడో స్థానానికే పరిమితమైంది. దీంతో వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు కోసం ఒకవైపు హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి తనయుడు రూపేష్ పాణిగ్రాహి తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, మరోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు కూడా రంగంలోకి దిగారు. అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, బీజేడీ యువజన విభాగం అధ్యక్షుడు శాసనం లింగరాజు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి బర్నాల జనార్దనరావులు అధికార బీజేడీ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే వీరిలో ఎవరికి పార్టీ అధిష్ఠానం టిక్కెట్టు కేటాయిస్తుందనే సస్పెన్స్ కొనసాగుతోంది.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి



వేదికపై నరేంద్ర కుమార్ మహంతి తదితరులు

జయపురం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి సూచించారు. స్థానిక గుర్రాల శాల మైదానంలోని అరవింద పూర్ణాంగ శిక్షణ కేంద్రం 23వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. విద్యా కేంద్ర పరిచాలన కమిటీ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో ముఖ్యవక్తగా సుమిత్ర దాస్, కమిటీ కార్యదర్శి నవకృష్ణ రథ్, విద్యాలయ కార్యదర్శి మున్నాభాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో మహిళ



గాయాలు పాలైన యువకుడు



జీపు నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ఆంద్రహాల్ పంచాయతీ బోడఘాటిలో ఒక జీపు అదుపుతప్పి బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. ముదిలిపోడ పంచాయతీ ఓనకడిల్లిలో జరుగుతున్న వారాంతపు సంతకు గురువారం ఉదయం పలువురు వెళ్లారు. అనంతరం జీపులో తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ప్రమాద స్థలంలోనే బోండ గిరిజన మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఖోయిర్‌పూట్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఇంతలో క్షతగాత్రులను బయటకు తీసి ఓనకడిల్లీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదానికి గురైన వాహనం

శరణు శరణు



ముర్రాటలతో బారులుతీసిన మహిళలు



అమ్మవారి నిజరూపం

నిద్దాలమ్మ తల్లికి మహిళలు ముర్రాటలెత్తారు. గ్రామమంతా ఊరేగింపుగా తిరిగి అమ్మకు మొక్కు చెల్లించారు. ముర్రాటలు సమర్పించడంతోగురువారం నిద్దాలమ్మ తల్లి మహోత్సవాలు ముగిశాయి. – జి.సిగడాం

వింత వ్యాధితో కోళ్లు మృతి



మృతి చెందిన కోళ్లు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఇళ్లలో పెంచుకున్న నాటు కోళ్లు వింత వ్యాధి సోకి చనిపోతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజులుగా ఆ గ్రామానికి చెందిన పొన్నాన పద్మ, కొట్టు భారతి, రావాడ చిన్నమ్ముడు, రాయి నారాయణమ్మలతో పాటు పలువురికి చెందిన సుమారు 50 కోళ్లు వరకు చనిపోయాయి. చక్కగా తిరుగుతున్న కోళ్లు రెక్కలు కొట్టుకుంటూ మృత్యువాత పడుతున్నాయని వారు చెబుతున్నారు. దీనిపై చీడిపూడి పశు వైద్యులు కిశోర్‌తో మాట్లాడగా.. గ్రామానికి వెళ్లి కోళ్ల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించామని, వ్యాధి నిర్ధారణ చేశాక మందులను మిగత కోళ్లకు అందిస్తామని చెప్పారు. ఇటీవల గుమ్మపాడు గ్రామంలో ఈ విధంగా కోళ్లు మృత్యువాత చెందాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా.. చనిపోయిన కోడికి పోస్టుమార్టం నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

26, 27 తేదీల్లో జేఎన్‌టీయూ జీవీలో జాతీయ స్థాయి సింపోజియం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురుజాడ విజయనగరం (జీవీ) ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26, 27వ తేదీల్లో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సదస్సు నిర్వహిస్తామని ట్రిబుల్ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం (డీఈఈఏ) జె.వాణిశ్రీ హాజరవుతారని తెలిపారు. తొలిరోజున వర్క్‌షాప్ ఆన్ జనరేటివ్ ఏఐ, స్పార్క్ టెక్-టెక్నికల్ క్విజ్, ఎలక్ట్రానిన్-ఎలక్ట్రికల్ ఎగ్జిబిషన్‌తోపాటు మరికొన్ని సాంకేతికేతర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 27న వర్క్‌షాప్ ఆన్ జనరేటివ్ ఏఐ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్ తోపాటు మరికొన్ని సాంకేతికేతర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు



మద్యం బాటిల్స్‌తో మహిళను అరెస్ట్ చేసిన ఎస్సై షణ్ముఖరావు

కురుపాం: మండల కేంద్రానికి కూత వేటులో ఉన్న మూలిగూడ జంక్షన్ వద్ద గురువారం 20 మద్యం బాటిల్స్ తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా మూలిగూడ జంక్షన్‌లో పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా ఓ మహిళ మద్యం బాటిల్స్ అక్రమంగా తరలిస్తుండడాన్ని గుర్తించి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

19 మద్యం సీసాలు తరలిస్తుండగా..

గంట్యాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గంట్యాడ పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరం మండలంలోని గుంకలాంకు చెందిన కింతాడ అప్పన్న గ్రామంలో అక్రమంగా విక్రయించేందుకు మద్యం తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో నరవ జంక్షన్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడి నుంచి 19 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

32 బాటిల్స్‌తో మరో వ్యక్తి..



జియ్యమ్మవలస: మద్యం బాటిల్స్‌తో అదుపులోకి తీసుకున్న నిందితుడితో ఎస్సై చిన్నంనాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామ శివారులో ఉన్న ప్రతాప్‌నగర్ కాలనీ వద్ద అక్రమంగా తరలిస్తున్న 32 మద్యం బాటిల్స్‌తో చింతలబెలగాం గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో కాపుకాసి పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గురుప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం



జాతీయ ప్రతిభా పురస్కారం అందుకుంటున్న సముద్రాల గురుప్రసాద్

విజయనగరం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. ఈ మేరకు రాజమండ్రిలోని ప్రకాశ్‌నగర్‌లో గల ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో గోదావరి కళాదర్బార్ పేరిట అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ సముద్రాల గురుప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తి మండ ప్రతాప్ అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, తెలంగాణ కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పగిడిపల్లి రాజారావు, శ్రీ విజ్ఞాన వేదిక అధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

కాస్త జాగ్రత్త వహిస్తే.. ఎనీమియా కాదు!



- దృష్టి సారించి.. రక్తహీనతను అధిగమించి
- సత్ఫలితాలనిస్తున్న 'ప్రిజం' కార్యక్రమం
- పాచిపెంటలో నెరవేరిన లక్ష్యం
- కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో యంత్రాంగం ప్రత్యేక కృషి
- ఠంచన్‌గా పౌష్టికాహారం సరఫరా
- నెలనెలా ఆరోగ్య పరీక్షలు
- అడవిబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మక్కువ మండలం బాగుజోల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు స్వయంగా చూస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ (ఫైల్)



పాచిపెంటలో ప్రిజం కార్యక్రమ అమలు తీరుపై సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో అధిక శాతం మంది మహిళలు నిరక్షరాస్యులే. అందునా అడవి బిడ్డలే అధికం. కష్టపడి పని చేయడమే గానీ.. ఆరోగ్య పరిరక్షణ మీద శ్రద్ధ ఉండదు. కుటుంబం బాగుండాలంటే.. ఆ కుటుంబాన్ని మోసే ఆడవారు ఆరోగ్యంగా ఉండాలి. ఈ విషయంపై అవగాహన లేక... కుటుంబ భారాన్ని మోసేందుకు మహిళలు తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. కౌమార దశలోనే కొందరు, గర్భస్థ సమయంలో మరికొందరు ప్రాణాలు విడుస్తున్న సంఘటనలూ అనేకం. ఇందుకు గల కారణాలపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆరా తీశారు. లోతుగా అధ్యయనం చేశారు. ప్రధానంగా రక్తహీనత వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని గుర్తించారు. తల్లి ఆరోగ్యం.. తద్వారానే పిల్ల ఆరోగ్యమని భావించారు. దీనికోసం ప్రభుత్వ సూచనలమేరకు 'ప్రిజం' (ప్రాజెక్టు ఫర్ రెడ్యుషన్ ఆఫ్ ఇన్‌ఫాంట్ మోరల్టీ రేట్ బి-10) కార్యక్రమాన్ని ఆచరణలోకి తెచ్చారు. ఇందులో జిల్లా యంత్రాంగాన్ని భాగస్వాములను చేశారు. రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దే బృహత్తర క్రతువును నిర్విఘ్నంగా ముందుకు నడిపిస్తున్నారు.

దశలవారీ పర్యవేక్షణ

గర్భం దాల్చిన మహిళలను త్వరగా గుర్తించి.. వారి పేర్లను నమోదు చేస్తున్నారు. వారికి అవసరమయ్యే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గర్భిణుల్లో రక్తహీనత గల వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నారు. ఇందుకు మండలాలలో ప్రత్యేకంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నేతృత్వంలో మండల స్థాయి రక్తహీనత నివారణ కార్యాచరణ కమిటీ (ఎనిమిక్ యాక్షన్ ప్లాన్)లను కలెక్టర్ నియమించారు. ఈ కమిటీల్లో ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ, మహిళా పోలీసులతో కలిసిన బృందాన్ని నియమించారు. ఈ బృందం మండలంలోని తమ పరిధిలో రక్తహీనత కలిగిన వారిని గుర్తిస్తుంది. వారి వివరాలు నమోదు చేస్తుంది. రక్తహీనత ఉన్న దశలను బట్టి.. వారి పర్యవేక్షణకు ఒక దత్తత అధికారిని కూడా నియమిస్తున్నారు. దత్తత అధికారులు నెలలో కనీసం మూడు సార్లు దత్తత తీసుకున్న రక్తహీనత కలిగిన వారిని కలుస్తారు. వారు పౌష్టికారాన్ని తీసుకుంటున్నారా లేదా, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకుంటున్నారా.. లేదా, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సంబంధిత వ్యక్తి మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నారా లేదా వంటివాటిని పరిశీలిస్తారు. బాధితులకు వాటిపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. పలువురు దత్తత అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు స్వయంగా డ్రై ఫ్రూట్స్, ఇతర పౌష్టికాహార పదార్థాలను కూడా అందిస్తున్నారు.

బాలింతలను పరిశీలిస్తే...

2023 నవంబరు 1వ తేదీ నాటికి పాచిపెంట మండలంలో 408 మంది బాలింతలు ఉండగా, హిమోగ్లోబిన్ 8 కంటే తక్కువ ఉన్న బాలింతలు 22 మంది (5.39శాతం). 2024 జనవరి 1వ తేదీ నాటికి అది సున్నా స్థాయికి చేరింది. 8 నుంచి 8.9 హిమోగ్లోబిన్ స్థాయిలో 101 మంది (24.76 శాతం) ఉండగా... 17 మంది (3.75 శాతం)కి తగ్గింది. 9 నుంచి 10.9 హిమోగ్లోబిన్ స్థాయిలో ఉన్న 226 మంది (55.39 శాతం) ఉండగా.. 352 మందికి (77.71 శాతం) చేరింది. 11 కంటే ఎక్కువ హిమోగ్లోబిన్ స్థాయి 59 మంది (14.46 శాతం) ఉండగా.. అది 84 మందికి (18.53 శాతం) పెరిగింది.

జగన్ ప్రభుత్వం.. అదనపు 'పోషణ'

గర్భిణులు, బాలింతలు, బాలికల్లో రక్తహీనత నివారణ కోసం ఐసీడీఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అదనపు 'పోషణ' అందిస్తోంది, రూరల్, ఏజెన్సీ ప్రాంతాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కింద పౌష్టికాహార కిట్లు అయిన టేక్ హోం రేషన్ ఇస్తోంది. బియ్యం, పప్పు, ఆయిల్, 30 గుడ్లు, పాలు, చోడిపిండి, అటుకులు, బెల్లం, చక్కీలు, ఎండు కర్జూరాలు వంటివి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం సరఫరా చేస్తోంది. పిల్లలకు బాలామృతం ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు. దీనివల్ల కూడా ఏజెన్సీ ప్రాంతంలో మరణాల శాతం తగ్గిందని.. పోషణస్థాయి పెరిగిందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

సత్ఫలితాలిస్తున్న 'ప్రిజం'

జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్న మండలాల్లో పాచిపెంట ఒకటి. ఈ మండలంపై జిల్లా యంత్రాంగ ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్ నిషాంత్ కుమార్ మార్గదర్శకత్వంలో అక్కడి మండల పరిషత్ అధికారి ఈ కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేసి విజయవంతమయ్యారు. అనుకున్న ఫలితాలు సాధించారు. 2023 నవంబర్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి వరకు చేపట్టిన ప్రిజం కార్యక్రమ ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.

- ఈ మండలంలో 361 మంది గర్భిణులు ఉండగా.. ఇందులో హిమోగ్లోబిన్ 8 కంటే తక్కువ ఉన్న వారు 48 మంది (13.29 శాతం)గా గుర్తించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి ఇది సున్నా స్థాయికి చేరింది.
- 8 నుంచి 8.9 హిమోగ్లోబిన్ స్థాయిలో 82 మంది (22.71 శాతం) ఉండగా.. అది 18 మంది (5.40 శాతం)కి తగ్గింది.
- 9 నుంచి 10.9 హిమోగ్లోబిన్ స్థాయిలో 215 మంది (59.55 శాతం) ఉండగా.. 261 మందికి (78.64 శాతం) చేరింది.
- 11 కంటే ఎక్కువ హిమోగ్లోబిన్ స్థాయి 16 మంది (4.45 శాతం) ఉండగా... ప్రస్తుతం 53 మందికి (15.96 శాతం) పెరిగింది.

రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

రక్తహీనత రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత ప్రధాన సమస్యగా గుర్తించాం. దానిని అధిగమించడానికి అన్ని చర్యలూ చేపట్టాం. అందుకే జిల్లాలో ప్రత్యేకంగా రక్తహీనత నివారణ కార్యాచరణ ప్రణాళిక, 10 సంవత్సరాల లోపు వయస్సుగల చిన్నారులలో మరణాల రేటు నివారణ ప్రిజమ్-10 ప్రాజెక్టును అమలు చేస్తున్నాం. పాచిపెంట గిరిజన మండలం అద్భుతమైన ఫలితాలు సాధించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్

బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు

శ్రీకాకుళం రూరల్ : జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ఉచితంగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. బీఎస్సీ ట్రాన్సిషన్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, కార్డియాకేర్, ఫెర్ఫ్యూషన్, రేడియాల జీ ఆఫ్తో మెట్రి, న్యూరో ఫిజియాలజీ, డయాలసిస్, రెసిపిరేటరీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని,ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని, వివరాలకు 7995013422, 91219 99654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

పూసపాటిరేగ: స్థానిక సినిమా థియేటర్ సమీపంలో జాతీయరహదారిపై గురువారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొని ఓ మహిళ తీవ్రగాయాల పాలైంది. పూసపాటిరేగలోని యాతపేటకు చెందిన గండమాని రమణమ్మ రహదారి దాటుతుండగా మోటార్‌సైకిల్ బలంగా ఢీకొట్టడంతో కాలు నుజ్జునుజ్జయింది. దీంతో ఆమెను విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూ జీవీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లోని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ విద్యార్థులు 9 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు లభించాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాంపస్‌లో 'సైంట్ లిమిటెడ్' నిర్వహించిన ప్లేస్‌మెంట్ ప్రక్రియలో తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వార్షిక కనీసం వేతనం రూ.4.5 లక్షలతో ఎంపికైన వారికి ఉద్యోగావకాశాలు దక్కాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.గురునాథ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ టీఎస్ఎన్ మూర్తి అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక చక్రవర్తి ఖాదర్ బాబా



సూఫీ సుగంధ మహోత్సవాల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- సూఫీ సుగంధ మహోత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలు

విజయనగరం: జగత్తు అంతా కీర్తిని సొంతం చేసుకుని ఆధ్యాత్మిక చక్రవర్తిగా విరాజుల్లుతున్న ఖాదర్ బాబా గొప్ప మహిమాన్వితుడని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కొనియాడారు. ఈ మేరకు గురువారం ఆయన విజయనగరంలోని ఖాదర్‌నగర్‌లో ఉన్న బాబా దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ప్రతినిధులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ముస్లిం సంప్రదాయంలో శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు గాదం మురళి, మారోజు శ్రీనివాసరావులు మాట్లాడుతూ విజయనగరం ప్రాంతంలో ఖాదర్ బాబా మహిమలు ఎంతో గొప్పవన్నారు. పేదలకు స్వాంతన చేకూర్చే విధంగా ఆనాడు బాబా అనేక మహిమలను చూపారని గుర్తు చేసుకున్నారు. బాబా వారి జయంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు సూఫీ సుగంధ మహోత్సవాలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నారని, ఉరుసు ఉత్సవాలలో ప్రసాద వితరణ కార్యక్రమం భారీ ఎత్తున చేపట్టడం ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిందన్నారు. ఖాదర్ బాబా ఆశయాలను అనుసరిస్తున్న ప్రతి ఒక్కరూ ధన్యజీవులని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, గదుల సత్యలత, వేముల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన..బాబా గంధ మహోత్సవం

విజయనగరం టౌన్: సూఫీ షెహన్‌షా హజరత్ సయ్యద్ ఖాదర్‌వలీబాబా 65వ ఉరుసు మహోత్సవాలు గురువారం దర్గాలో నిర్వహించిన సలామ్ ఖుల్ షరీఫ్‌తో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు హాజరై దర్గాలో సుగంధ, చాదర్ సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సూఫీ పరంపర మహనీయులను స్మరించుకుంటూ విశ్వశాంతి కోసం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనేక మంది ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాబా దర్బార్‌ను దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు లంగర్ ఖానాలో లక్షలమంది భక్తులకు దివ్య అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా దర్గా దర్బార్ ధర్మకర్త ఖలీల్‌బాబు మాట్లాడుతూ అందరి సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయగలిగామని సంతోషం వెలిబుచ్చారు.

భోగాపురం విమానాశ్రయం పనులపై సమీక్ష



పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో ప్రదర్శించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు

విజయనగరం అర్బన్: భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనుల ప్రగతిపై వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. విమానాశ్రయం నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలోనే అక్కడ నుంచి విమాన రాకపోకలు సాగేలా పనుల్లో జోరు పెంచాలని విమానాశ్రయ నిర్మాణ సంస్థను, అధికారులను సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమలు పెట్టుబడుల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనుల ప్రగతిని చూపించారు. ఏటీసీ, పరిపాలనా భవనం, పాసింజర్ టెర్మినల్స్ నిర్మాణాల తీరును వివరించారు. ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు 86 శాతం పూర్తయ్యాయని, వచ్చే నెలలో ప్రారంభించేందుకు వీలుగా మిగతా పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్యూఆర్ కోడ్‌తో పది ప్రశ్నపత్రం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: క్యూఆర్ కోడ్‌తో పదోతరగతి ప్రశ్నపత్రం ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏపీ ఓపెన్ స్కూల్, ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్లు సౌరబ్ గౌర్, సురేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో గురువారం మాట్లాడారు. ప్రతి పేజీపై క్యూ ఆర్ కోడ్‌తో పది ప్రశ్నపత్రం ఉంటుందని, ప్రశ్నపత్రంపై విద్యార్థి రోల్ నంబర్, బార్ కోడ్, మొదటి పేజీలో మైక్రో లెటర్, ప్రతీ పేజీపై నిలువున మూడు చోట్ల యూనిక్ డిజిటల్ నంబర్ ముద్రించి ఉంటుందని వివరించారు. ప్రశ్నపత్రం లీకేజీ అయితే ఏ విద్యార్థి నుంచి బయటకు వచ్చిందో తెలుస్తుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, బల్లలు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు నిషేధమని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 9 గంటల తరువాత ప్రవేశం ఉండదన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. పదోతరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పదోతరగతి పరీక్షలకు 5,124 మంది బాలురు, 5,410 మంది బాలికలు కలిపి 10,534 మంది హాజరవుతారన్నారు. అలాగే, గతంలో ఉత్తీర్ణులుకాని మరో 664 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. మొత్తం 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఓపెన్ స్కూల్ పదో తరగతికి 712 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 493 మంది హాజరవుతారన్నారు. వీరికి 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డీఈఓ జి.పగడాలమ్మ, డీటీఓ టీవీఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు ప్రదర్శన



పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. గ్రామదేవత బంగారమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పరుగు ప్రదర్శనలో విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 12 గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు రూ.పదహారువేలు, రూ.పదమూడువేలు, రూ.పదకొండు వేలు, రూ.తొమ్మిదివేలు, రూ.ఎనిమిది వేలు, రూ.ఏడువేలు చొప్పున నగదు బహుమతులను గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు విజేతలకు అందజేశారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సారంగధర బుర్రకథతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహించారు.

రామతీర్థంలో నేడు రథయాత్ర

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం సిబ్బంది
- తిరువీధిలో ఊరేగనున్న సీతారామచంద్ర మూర్తి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు



రథయాత్రకు సిద్ధమైన స్వామివారి రథం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శుక్రవారం రాత్రి రథయాత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నా రు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి పందిరిరాట రోజునే ఆనవాయితీగా సీతారామునిపేట, గొర్లిపేట గ్రామస్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చి పవిత్ర రథాన్ని నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేశారు. రథయాత్ర మహోత్సవానికి దేవస్థానం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

స్వామివారికి తిరువీధి..

ప్రత్యేక పూజలనంతరం సాయంత్రం 6 గంటలకు పండిత పరిషత్తు కార్యక్రమాన్ని నిర్వహించి పండితులను సన్మానించనున్నారు. తరువాత ఉత్తర రాజగోపురం సమీపంలో సీతారామస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు జరిపించి రాత్రి 10గంటలకు రథంలో స్వామివారు రామతీర్థం పురవీధుల్లో ఊరేగుతారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా తిరువీధి ప్రారంభమై ప్రధానరహదారి నుంచి కుమ్మరికానా వరకు వెళ్లి అక్కడినుంచి తిరువీధి మార్గం ద్వారా ఆలయం వరకు స్వామివారి యాత్ర కొనసాగుతుంది. సీతారామునిపేట, గొర్లిపేట, జగ్గరాజుపేట గ్రామాలకి చెందిన భక్తులు స్వామివారి రథాన్ని లాగడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. రథం ముందుకు సాగుతున్నప్పుడు భక్తులు రథంపైకి అరటిపళ్లు విసురుతూ మొక్కులు చెల్లించుకుంటారు.

వైభవంగా పూర్ణాహుతి

పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారామస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో పట్టాభిషేక మహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రేజేటి మల్లికార్జునశర్మ, సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, సిబ్బంది రామారావు, తులసి, భక్తులు పాల్గొన్నారు.